# పేట అభివృద్ధికి బాట

- నారాయణపేటలో దూసుకుపోతున్న కారు
- జిల్లా ఆవిర్భావంతో మారిన రూపురేఖలు
- హ్యాట్రిక్ దిశగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అడుగులు



నారాయణపేట మినీ ట్యాంక్‌బండ్

నారాయణపేట, నవంబర్ 16 : నారాయణపేట నియోజకవర్గంలో కంచుకోటగా ఉన్న ఇతర పార్టీలను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా చేసింది. తిరిగి ఈసారి ఎన్నికల్లో కూడా కారు జోరు మీద దూసుకుపోతున్నది. 1952 నుంచి మక్తల్ నియోజకవర్గంలో ఉన్న నారాయణపేట, 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కోయిలకొండ, మరికల్, ధన్వాడ, దామరగిద్ద, నారాయణపేట మండలాలతోపాటు నారాయణపేట మున్సిపాలిటీలతో కొత్త నియోజకవర్గంగా ఏర్పడింది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏర్పడిన నారాయణపేట నియోజకవర్గంలో జరిగిన తొలి ఎన్నికల్లో ఇతర పార్టీ విజయం సాధించింది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఇతర పార్టీ తరఫున ఎస్.రాజేందర్‌రెడ్డి 40,107 ఓట్లు రాగా, 2,270 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో అభివృద్ధిలో భాగస్వాములుకావాలన్న ఉద్దేశంతో అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో ఎస్.రాజేందర్‌రెడ్డికి 68,767 ఓట్లు, సరాఫ్ కృష్ణకు 6,344 ఓట్లు, శివకుమార్ రెడ్డికి 53,580 ఓట్లు, రతంగ్‌పాండురెడ్డికి 20,111 ఓట్లు వచ్చాయి. దీంతో 15,187 ఓట్ల మెజార్టీతో ఎస్.రాజేందర్‌రెడ్డి రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

**హ్యాట్రిక్ దిశగా అడుగులు..**


ప్రస్తుతం నారాయణపేట నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల్లో తిరిగి ఎస్.రాజేందర్‌రెడ్డి గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. నెలన్నర కిందటే గులాబీ బాస్ బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడం, బీఫారాలను సైతం అందజేయడంతో ప్రచారం ప్రారంభించి ప్రత్యర్థి పార్టీలకంటే పైచేయిగా నిలిచారు. కార్యకర్తలతో, బూత్ స్థాయి కమిటీలతో, వివిధ సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి మద్దతు కూడగట్టుకున్నారు.

**పరుగులు తీసున్న అభివృద్ధి..**

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో, అదేవిధంగా నారాయణపేట జిల్లా ఆవిర్భావం తర్వాత చేపడుతున్న వందల కోట్ల అభివృద్ధి పనులతో రూపురేఖలు మారి పోయాయి ఊహించని రీతిలో జరుగుతున్న పనులపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో కనీవినీ ఎరుగని రీతిలో గతంలో పని చేసిన ఏ ఎమ్మెల్యే చేయని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నారు.

**నారాయణపేటకు రాష్ట్ర స్థాయి గుర్తింపు..**

ఒకప్పుడు నారాయణపేట అంటే తెలియని స్థితి నుంచి అభివృద్ధి పనుల కారణంగా రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచే స్థాయి చేరుకోవడం గొప్ప పరిణామంగా చెప్పుకోవచ్చు. కొత్త బస్టాండ్ సమీపంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ మెచ్చుకోవడంతో పాటు అందుకు కృషి చేసిన నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని శభాష్ అని ప్రశంసించడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు ఒక్కసారిగా రాష్ట్ర స్థాయి గుర్తింపు వచ్చింది. నారాయణపేటలో సత్యనారాయణ చౌరస్తా నుంచి సుభాష్ రోడ్, భీమండి కాలనీ నుంచి ఎర్రగుట్ట వరకు గల ఇరుకైన రోడ్ల కారణంగా ప్రతినిత్యం ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాజేందర్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారిగా రోడ్ల విస్తరణలో ఇండ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లిస్తూ రూ.28కోట్ల 50లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడడమే కాకుండా 80ఫీట్ల రోడ్డు, మధ్యలో డివైడర్లు, పూల చెట్లు, బటర్ ఫ్లై లైట్లతో సుందరమైన రోడ్డును నిర్మించారు. రూ.3కోట్ల 65లక్షలతో అంబేద్కర్ చౌరస్తా నుంచి వీరసావర్కర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. రూ.9లక్షలతో దోబివాడలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మించారు. ఆదర్శ హిల్స్‌లోని చౌడేశ్వరి ఆలయం సమీపంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేశారు. రూ.50లక్షలతో అటవీ శాఖ క్వార్టర్స్ నిర్మించారు. మహబూబ్‌నగర్ అర్బన్ ఎకో పార్క్ మాదిరిగా నారాయణపేట మండలం ఎక్లాస్పూర్‌లో 200 ఎకరాల్లో రూ.2కోట్ల వ్యయంతో ఎకోపార్క్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. నారాయణపేటలో రూ.2కోట్ల 5లక్షలతో ఈద్గా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.90లక్షలతో వెజ్ – నాన్‌వెజ్ మార్కెట్ నిర్మించారు. అదేవిధంగా రూ.కోటీ 85లక్షలతో ఫిష్ మార్కెట్ నిర్మించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. రూ.2కోట్లతో జిల్లా గ్రంథాలయ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఒక్క నారాయణపేట మున్సిపాలిటీలోనే రూ.33కోట్లతో మిషన్ భగీరథ పనులు, రూ.20కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.2కోట్లతో ఎనిమిది మహిళా సంఘాల భవనాల నిర్మాణాలు జరిగాయి ఎస్సీ వాడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.80లక్షలు మంజూరయ్యాయి. రూ.1కోటి 30లక్షల వ్యయంతో సైన్స్ పార్క్, రూ.85లక్షలతో సీనియర్ సిటిజన్ పార్క్ నిర్మించారు. తాజాగా బీసీ కాలనీ సమీపంలో రూ.2కోట్లతో కేసీఆర్ పార్క్‌ను నిర్మిస్తున్నారు. వీటితో పాటు సఖి సెంటర్, వృద్ధాశ్రమం, అనాథాశ్రమం నిర్మించారు.



ఎక్లాస్‌పూర్ ఎకో పార్కు

రూ.4కోట్ల వ్యయంతో కొండా రెడ్డిపల్లి చెరువును మినీట్యాంక్ బండ్‌కు నిర్మించి అక్కడ ఆహ్లాదకరమైన పార్క్‌ను పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దారు. నారాయణపేట జిల్లాకు జిల్లా దవాఖాన మంజూరు చేయించి నారాయణపేట మండలం అప్పంపల్లి సమీపంలో రూ.56కోట్ల వ్యయంతో జిల్లా దవాఖాన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేయించారు. నారాయణపేట మండలం సింగారం సమీపంలో జిల్లా సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి రూ.52కోట్లు, ఎస్పీ కార్యాలయానికి రూ.36కోట్లు, మిషనరీ మెకనైజ్డ్ ల్యాండ్రీ ఏర్పాటుకు రూ.2కోట్లు, నారాయణపేట మండలం అప్పంపల్లి నుంచి కోయిల్‌కొండ వరకు రూ.56కోట్లతో డబుల్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నారాయణపేట జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో వ్యవసాయ గోదాంలు, రైతు భవనాలను నిర్మించారు. ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించారు. ధన్వాడకు డిగ్రీ కళాశాల, నారాయణపేటలో అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాల మంజూరుతో పాటు తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.

- పని చేసి
- ధైర్యంగా ఓట్లడుగుతున్నాం..
- కారు గుర్తుకు ఓటేసి సహకరించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# సుస్థిర పాలన అందిస్తున్నాం



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

మూసాపేట, నవంబర్ 16 : అభివృద్ధి సారథి సీఎం కేసీఆర్‌ను ప్రజలకు మరువొద్దని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లలోనే ఎంతో అభివృద్ధి చేశారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో గురువారం రాత్రి మంత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామస్తులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. గజమాలతో సన్మానించారు. మంత్రి చేసిన అభివృద్ధికి అకర్షితులై గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 20మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. ఎలాంటి బేదాభిప్రాయం లేకుండా సుస్థిర పాలన అందిస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో ప్రజలు కూడా అదే నిబద్ధతతో పార్టీలకు అతీతంగా కేసీఆర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ఏర్పాటు నాటి నుంచి సీఎం కేసీఆర్ గ్రామ స్వరాజ్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, ధైర్యంగా ఓట్లు అడుతున్నామని, కానీ కాంగ్రెస్ పార్టీ సంక్షోభాన్ని సృష్టించి ప్రజల బతుకులను ఆగం చేసి వలస జీవులను చేసిందని చెప్పారు. నేడు సీఎం కేసీఆర్ సహకారంతో ప్రతి పల్లెకు సాగు నీరు తీసుకొచ్చి పచ్చని పంటలు పండేలా చేశారని, దగా పడ్డ బతుకులను మార్చిన బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

- కోస్గిలో రూ.5.5 కోట్లతో 50 పడకల దవాఖాన
- 55 ఏండ్ల కల సాకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

# వైద్యానికి భరోసా

కోస్గి, నవంబర్ 16 : కోస్గి మండల ప్రజల 70ఏండ్ల కల సాకారమైంది. పట్టణంలో రూ.5.5కోట్లతో రెండస్తుల్లో 50 పడకల దవాఖానను గత నెల 4వ తేదీన వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభమై కోస్గి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గతంలో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే నానుడి నుంచి ప్రభుత్వ దవాఖానకు పోదాం బిడ్డో అనేలా సీఎం కేసీఆర్ సర్కారు వైద్యంపై భరోసా కల్పించారు. కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కోస్గి ప్రభుత్వ దవాఖాన ఎట్టకేలకు ప్రారంభమైంది. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు దవాఖానకు ప్రజలు వస్తున్నారు. మెరుగైన వైద్యంతో పాటు దవాఖానలో స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో రోగితో పాటు వచ్చిన వారికి సౌకర్యంగా మారింది. గతంలో చికిత్స కోసం వచ్చిన రోగులకు సరైన బెడ్లు కూడా ఉండేవి కావు. ప్రస్తుతం పరీక్షల గది, ల్యాబ్, జనరల్ ఫీమేల్ క్లినిక్, జనరల్ మేల్ క్లినిక్, డెంటల్, గైనకాలజిస్టు, పీడియాట్రిక్, ఆయూష్, ఇంజక్షన్, డ్రెస్సింగ్ రూమ్, మెయిన్ స్టోర్, డిస్పెన్సరీ, ఆపరేషన్ థియేటర్, లేబర్, రికవరీ రూమ్, ఇన్సులేషన్ వార్డు, నర్సు రూమ్, మేల్ మెడికల్ సర్జికల్ వార్డు, రెండు జనరల్ వార్డు, ఆఫీస్ ఇన్‌చార్జి, మీటింగ్ రూం, ఐసీయూ, రిసెప్షన్, స్టోర్, అడ్మినిస్ట్రేషన్ ఇలా అందరికీ సౌకర్యంగా ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఓపీ సేవలు పెరిగాయి



దవాఖానలోని జనరల్ వార్డు



ఆపరేషన్ థియేటర్

## ప్రైవేటు దవాఖానలా మారిపోయింది..



పేద ప్రజలకు కేసీఆర్ సర్కారులోనే మెరుగైన వైద్యం అందుతుంది. గతంలో ప్రభుత్వ దవాఖానకు రావాలంటే ఆలోచించేటోళ్లం. నేడు అన్ని రకాల సదుపాయాలు కల్పించడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవతోనే దవాఖాన ఇంతలా మారి పోయింది రెండు అంతస్తుల బిల్డింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నో ఏండ్ల కల నెరవేరింది.

**- మొగులయ్య, చంద్రవంచ**

## గతంలో అభివృద్ధి శూన్యం..



ఉమ్మడి రాష్ట్రంలో కొడంగల్ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదు. సొంత అభివృద్ధి కోసమే పని చేశారు. ఐదేండ్లలోనే రూ.5.5కోట్ల వ్యయంతో కోస్గి ప్రభుత్వ దవాఖానను నిర్మించాం. అవసరమైన వసతులను, సిబ్బందిని, డాక్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం. ఇది వరకు ఏదైనా చిన్న ఆపరేషన్ అయినా తాండూర్, నారాయణపేట వెళ్లే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహించి అవసరమైన సేవలు అందించేలా దవాఖానను తీర్చిదిద్దాం.

**- కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**